క్లుప్తంగా

పునర్వసు కల్యాణం

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. గోదావరి నీటితో అభిషేకాలు చేసి, పునర్వసు నక్షత్ర కల్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని వీక్షించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే హైదరబాద్ నుంచి వచ్చిన 150 మంది భక్తులకు రామకోటి విశిష్టతను తెలియపరిచి వారిచేత 108 నామాలు గల రామకోటి లిఖింపజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, ఆలయ ముఖ్య అర్చకులు భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సేవారత్న' అవార్డు



ప్రకాశ్‌కు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

చర్ల: చర్ల వాసి, వేయికి పైగా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ నీలి ప్రకాశ్‌కు జాతీయ ఉత్తమ విశ్వజనని సేవారత్న అవార్డు లభించింది. ఏపీలోని నరసరావుపేటకు చెందిన విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయను అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కరకగూడెం: ఎంపీఓ మారుతీ యాదవ్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు కరకగూడెం ఎస్సీ కాలనీలోని వరద ప్రభావిత పరిసర ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. మండలంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే వీధులన్నీ చెరువులను తలపిస్తున్నాయంటూ బుధవారం 'సాక్షి'పత్రికలో 'వానొచ్చెనంటే వరదొచ్చినట్టే 'అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి.. త్వరలో పలుచోట్ల నూతన డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. అలాగే వర్షాలు తగ్గిన తరువాత పూడికతీత పనులను కూడా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

మణుగూరురూరల్: పోగొట్టుకున్న సెల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బుధవారం మణుగూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ పాటి నాగబాబుకు బాధితులకు అప్పగించారు. మణుగూరు మండలానికి చెందిన పది మంది వ్యక్తులు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ నాగబాబు, ఎస్సై బి.రంజిత్, పీసీ వెంకన్నలు పోయిన విచారణ జరిపి సెల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న, చోరీకి గురైన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లో తమ ఫోన్ వివరాలతో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా పోయిన సెల్ ఫోన్లను తిరిగి పొందే అవకాశం ఉంటుందని సీఐ నాగబాబు తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకుల నివాళి

దమ్మపేట: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకురాలు తాతా నాగమణి చిత్రపటానికి బీఆర్‌ఎస్ పార్టీ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు తాతా మధు, రేగా కాంతారావులు బుధవారం పూలతో నివాళులర్పించారు. వీరితో పాటుగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వర రావు, తాటి వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అధిష్టానం అందజేసిన రూ.5 లక్షల చెక్కును వారికి అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, సున్నం నాగమణి, రావు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై ఆందోళన

బూర్గంపాడు: సారపాకలో అంతర్గత రహదారుల దుస్థితిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. సారపాక మసీద్ రోడ్‌లోని గోతుల వద్ద చేపట్టిన ఈ ఆందోళనలో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్ మాట్లాడారు. గోతులు పూడ్చాలని, రోడ్లకు మరమ్మతులు చేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు స్పందించలేదని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి ఏసుబు, బెజ్జంకి కనకాచారి, చల్లకోటి పూర్ణ, సోము లక్ష్మీచైతన్యరెడ్డి,పంగి సురేష్, కర్రి నాగేశ్వరరావు, భూక్యా కృష్ణ, బానోతు శ్రీను, గుల్ మహ్మద్, ఖాదర్, అంజనేయులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా అబార్షన్లు?

- మధ్యవర్తుల కనుసన్నల్లోనే వ్యవహారం
- కీలకంగా ఆస్పత్రుల సిబ్బంది.. అదేబాటలో కొందరు వైద్యులు?
- కన్నెత్తి చూడని వైద్యారోగ్య శాఖ



భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అడిగినంత డబ్బు చెల్లిస్తే చాలు.. కారణాలు అడగకుండా, ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో పట్టించుకోకుండా అబార్షన్లు చేస్తున్నారని సమాచారం. స్థానిక ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తే వారు బస్టాండ్ సమీపాన ఉన్న ఒకటి, రెండు ఆస్పత్రుల్లో అబార్షన్ చేయిస్తున్నట్లు తెలిసింది. ఆర్‌ఎంపీలు తమకు వచ్చే కమిషన్‌కు ఆశపడి యువతులను ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్తుండగా.. అబార్షన్లతో వారి ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది.

ఈ పరిస్థితుల్లోనే..

గర్భంలో శిశువు బుద్ధిమాంద్యం, తక్కువ బరువు, వివిధ రకాల రుగ్మతలతో ఉన్నప్పుడు.. తల్లికి ప్రాణాపాయస్థితి ఎదురైందని తెలిస్తే ప్రభుత్వం అబార్షన్‌కు అనుమతిస్తుంది. ఇది కూడా సుశిక్షితులైన స్త్రీ వైద్యనిపుణులే చేయాలి. అంతేకాక ఆస్పత్రి రిజిస్ట్రేషన్ జరిగి ఉండాలి. అలాగే, గర్భం దాల్చి 12 వారాలయ్యాక గైనాకాలజిస్టుతో పరీక్ష చేయించుకుని తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిస్తే అబార్షన్ చేయించుకోవచ్చు. గర్భం దాల్చి 12–20 వారాలైతే ఇద్దరు గైనకాలజిస్టుల అనుమతితో అబార్షన్ చేయాలి. కానీ భద్రాచలంలో కొందరు వైద్యులు ఇదేమీ పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ఏదైనా ఆస్పత్రిలో అబార్షన్, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే వైద్యారోగ్య శాఖాధికారులు విచారణ చేపట్టాలి. నిబంధనలు పాటించలేదని తేలితే ఆస్పత్రిని సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసు నమోదుకు అవకాశముంది. కానీ కిందిస్థాయి సిబ్బంది కొందరు ఫిర్యాదులు ఉన్నత అధికారుల వరకు వెళ్లకుండా అక్కడికక్కడే పరిష్కారం చూపేలా మంతనాలు జరుపుతున్నారని సమాచారం. ఈ క్రమంలో పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారుతోందనే ప్రచారం జరుగుతోంది.

ఆడపిల్ల అని తేలితే..

మహిళ గర్భం దాల్చగానే పరిచయం ఉన్న స్కానింగ్ సెంటర్లలో పరీక్ష చేయించి ఆడ శిశువు అని తేలితే అబార్షన్‌కు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒక్కోసారి గర్భిణి వద్దని వారించినా కుటుంబీకులు వినకపోగా.. ఇంకొన్ని సార్లు మహిళలే ముందుకొస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు భద్రాచలం బస్టాండ్ సమీపాన కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బందిని సంప్రదించగా మాత్రలు ఇస్తున్నట్లు సమాచారం. ఈ క్రమాన రక్తస్రావం కాగానే ఆస్పత్రిలో చేర్పిస్తూ వైద్యులు అడిగితే ప్రమాదంతో ఇలా జరిగిందని చెబుతూ అబార్షన్లు చేయిస్తున్నట్లు తెలిసింది. కాగా, భద్రాచలంలోని ఒకటి, రెండు ఆస్పత్రుల్లో సిబ్బంది మహిళల పేర్లు, చిరునామా తప్పుగా నమోదు చేయించి తనిఖీలు జరిగినా దొరకకుండా జాగ్రత్త పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఓ ఆస్పత్రిలో అర్ధరాత్రి వేళ ఇద్దరు యువతులకు అబార్షన్ చేసి రూ.50 వేల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. అలాగే, మిగతా వారి నుంచి సైతం పరిస్థితుల ఆధారంగా రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు తీసుకుంటున్నట్లు తెలిసింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు ఆస్పత్రులను పర్యవేక్షిస్తున్నాం. ఎక్కడైనా అబార్షన్లు చేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం . ఆస్పత్రిని సీజ్ చేయడమే కాక క్రిమినల్ కేసు నమోదుకు వెనుకాడేది లేదు. అబార్షన్లు జరగకుండా పకడ్బందీ నిఘా ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, భద్రాచలం

కేబుల్ వైర్లను తొలగించాలి



అశ్వారావుపేటరూరల్: కేబుల్ వైర్లు ఉన్న కరెంట్ స్తంభాన్ని పరిశీలిస్తున్న ఏడీఈ, సిబ్బంది

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు: ప్రమాదకర స్థాయిలో ఉన్న కేబుల్ వైర్ల మూలంగా విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, కేబుల్ వైర్లను మూడురోజుల వ్యవధిలో రి–అలైన్మెంట్ చేసుకోవాలని భద్రాచలం విద్యుత్ శాఖ డీఈ జీవన్ కుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలాడుతున్న కేబుల్ వైర్లను మూడు అడుగుల దూరంలో విద్యుత్ లైన్ల కింద బంచ్ చేసి కట్టాలని కేబుల్ టీవీ ఆపరేటర్లకు సూచనలిచ్చారు. వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, ఎత్తు విగ్రహాల తరలింపు సమయంలో ఇబ్బందులు ఎదురైతే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన సూచించారు. భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చెర్ల, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని డీఈ జీవన్ కుమార్ ఆదేశించారు.

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించిన కరెంట్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని, ఈ మేరకు ఆయా సంస్థల బాధ్యులకు నోటీసులు జారీ చేయనున్నట్లు స్థానిక ఎన్పీడీసీఎల్ ఏడీఈ వెంకట రత్నం తెలిపారు. బుధవారం ఆయన శాఖ సిబ్బందితో కలిసి అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్, టీసీఎం రోడ్‌తోపాటు పలు ప్రాంతాల్లో పర్యటించి, కరెంట్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను పరిశీలించారు. వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించేందుకు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్ల ప్రారంభం



పినపాక: పొట్లపల్లిలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: మండల పరిధిలోని పొట్లపల్లి, మల్లారం గ్రామపంచాయతీలలో సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్లను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పినపాక మండలాన్ని రోల్ మోడల్గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రైతులకు యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్రంతో కొట్లాడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మణుగూరురూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మణుగూరు మండలానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన రూ.లక్షా 15వేల విలువ గల చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం స్థానిక ప్రజాభవన్‌లో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటి చైర్మన్ కూచిపూడిబాబు, నాయకులు గణేష్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తితో వ్యాధులు



మణుగూరురూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మణుగూరురూరల్: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు, వైద్యసిబ్బంది దోమల ద్వారా సంక్రమించే వ్యాధులు, వాటి నివారణ మార్గాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ సునీల్, డాక్టర్ పావని, వైద్యసిబ్బంది, హాస్టల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యాధికారి సంఘమిత్ర అన్నారు. బుధవారం కాచనపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీఎస్ పాఠశాల విజిట్ చేశారు.తదుపరి కాచనపల్లి మోడల్ స్పోర్ట్స్ స్కూల్ నందు మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. బుధవారం వరల్డ్ మస్కి టోడే సందర్భంగా విద్యార్థులకు దోమల నివారణ పై అవగాహన కల్పించడంతోపాటు ఆరోగ్యంపై పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల సమీపంలో లారీ బోల్తా

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై మలుపు వద్ద బుధవారం కర్రలారీ బోల్తా కొట్టింది. మలుపు వద్ద ప్రభుత్వ పాఠశాల ఉంది. ఉదయం విద్యార్థులు ప్రతిజ్ఞ చేస్తుండగా అదే సమయంలో లారీ బోల్తా పడి పాఠశాల ప్రహరీని ధ్వంసం చేసుకుంటూ జామాయిల్ కర్రలు వెళ్లాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంతోనే ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రతిజ్ఞను పాఠశాల వెనుకభాగంలో చేయిస్తున్నారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్‌ఐ శివరామకృష్ణ, నేషనల్ హైవే అధికారులు, వివిధ పార్టీల నాయకులు నల్లమోతు రమణ, రఘుపతిరావు, వెంకటనారాయణ సందర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని బుర్రవేములా గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతానగరం గ్రామానికి చెందిన వాగే సాయిచరణ్ తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సాయిచరణ్ భద్రాచలం నుంచి సీతానగరం వస్తుండగా.. బుర్రవేములా గ్రామం వద్ద లారీ ఎదురుగా వచ్చింది. దానిని తప్పించబోయి కిందపడటంతో లారీ వెనక టైరు సాయిచరణ్ భుజంపై రాసుకునిపోయింది. దీంతోపాటు ఆటోపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు భద్రాచలం వైద్యశాలకు తరలించారు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తున్నట్లు సమాచారం.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ములకలపల్లి: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎస్.మధుప్రసాద్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. యువతరం గంజాయి, మద్యం వంటి దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు, ప్రిన్సిపాల్ కల్పన. ప్రోగ్రాం అధికారి అతహర్ అలీ, రాజేశ్వరి, కుమారస్వామి, సుచరిత, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ చావల చంద్రశేఖర్ సూచించారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఉత్సవ కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. ఇతల కుల, మతాల ఆచారాలకు భంగం కలిగించకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

విద్యుత్ పోల్ ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో ఉన్న ఓ విద్యుత్ పోల్‌ను మంగళవారం అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో సదరు విద్యుత్ పోల్ ప్రమాద భరితంగా నేలకొరిగింది. ఓ వైపు తీవ్రంగా వర్షం కురుస్తుంది, మరోవైపు చిమ్మ చీకటి ఉన్నప్పటికీ విద్యుత్ పునరుద్ధరణకు ఆ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. నూతన విద్యుత్ పోల్‌ను ఏర్పాటు చేసి కాలనీలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరణ చేశారు. సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించిన విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, లైన్మెన్ త్రినాథ్ రెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ జగదీష్ పట్ల స్థానిక కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రహదారిపై నాట్లు వేసి నిరసన



చిత్తడి రహదారిపై నాట్లు వేస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని కాశీనగరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కె కాశీనగరం నుంచి మధ్యగుంపు మీదుగా గ్రామ పంచాయతీ ఆఫీస్ వరకు వచ్చే రోడ్డు మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలం చిత్తడిగా మారుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తులు బుధవారం రహదారిపై వరి నాట్లు వేసి తమ నిరసన తెలియజేశారు. గ్రామం నుండి మండల కేంద్రానికి రావాలన్నా.. పోలాలకు వెళ్లాలన్నా.. ఎవరికైనా ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్‌కి వెళ్లాలన్నా ఇబ్బంది అంతా ఇంతా కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి సిమెంట్ రోడ్లు.. లేదా కనీసం గ్రావెల్ రోడ్డు వేయించాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పూనెం చిన్నబ్బి, కుంజా మస్తాన్, మట్టా ప్రవీణ్ కుమార్, కురసం లింగ రాజు, మట్టా బాస్, మట్టా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యూషన్ ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతులా గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు దబ్బనూతుల యూత్ ఐకాన్ ఆధ్వర్యంలో బుధవారం సీఐ అశోక్ చేతుల మీదుగా ట్యూషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పాఠశాల వాతావరణాన్ని విద్యా బోధన విధానాన్ని ఆయన పరిశీలించి ఉపాధ్యాయుడు బాబూరావును అభినందించారు. ట్యూషన్ చెప్పేందుకు ముందుకొచ్చిన దబ్బనూతుల యూత్ ఐకాన్ సభ్యులను అభినందించారు. తదనంతరం బండలూరు ఫౌండేషన్ వారి సహకారంతో స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం సీఐ అశోక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ ఐకాన్ ఫౌండర్ సోందె నర్సింహారావు, సభ్యులు నాగరాజు, తామ రాజు, అడ్వకేట్ మహేష్, బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు శ్యామల రవివర్మ, ఉప వ్యవస్థాపకుడు కణితి రాజు, ముర్తాజ్ అలీఖాన్, టీచర్ బాబూరావు, ట్యూషన్ టీచర్ శ్రావణి, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఉద్యమకారుల సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ప్రమీల

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా మణుగూరుకు చెందిన మునుకోటి ప్రమీల నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామ అంజిరెడ్డి బుధవారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అనంతరం మునుకోటి ప్రమీల మాట్లాడుతూ.. సంక్షేమ సంఘ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలాజీ

చర్ల: చర్ల మండల గణేష్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా మరోమారు చర్లకు చెందిన పామారు బాలాజీ ఎంపికయ్యారు. బుధవారం చర్లలోని గ్రామ పంచాయతీ సంత మార్కెట్‌కాంప్లెక్స్‌లో జరిగిన ఆటో డ్రైవర్లు, ఓనర్ల సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా తెల్లమల్ల అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దనసరి సంపత్, బాలరాజుల సత్తిబాబు, కార్యదర్శిగా కోడిరెక్కల నాగరాజు, సహాయ కార్యదర్శిగా చల్ల అశోక్‌కుమార్, కోశాదికారిగా కుక్కడపు రాంబాబుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, బాలాజీ అధ్యక్షుడికి ఎన్నికవడం ఇది రెండోసారి.

పాఠశాలకు వితరణ

బూర్గంపాడు: మోరంపల్లిబంజర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సీలింగ్ ఫ్యాన్లు అందించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారమందిస్తామని ట్రస్ట్ అధ్యక్షులు కైపు లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, కొండ్రు వెంకటేశ్వర్లు, పుట్టి రాజేశ్, గాదె నర్సిరెడ్డి, సోము ఆదిరెడ్డి,తమ్మినేని శ్రీనివాసరావు, బిజ్జం వెంకట్రామిరెడ్డి, కామిరెడ్డి వెంకటనాగిరెడ్డి, హెచ్‌ఎమ్ శిరోమణి, ఉపాధ్యాయులు రామారావు, సైదులు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని గిరిజన సంక్షేమ కళాశాలలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. యుక్తవయసు బాలికల్లో రక్తహీనత సమస్యలు వస్తాయని, రోజు ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, కళాశాల ప్రిన్స్‌పాల్ చైతన్య, వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, సోనియా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

దుమ్ముగూడెం: ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కారంపూడి దశమ్‌బాబు డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రామచంద్రునిపేట ఆశ్రమ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబర్ ఒకటో తారీఖున ఇందిరా పార్క్ హైదరాబాద్ లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పూనెం నరసయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దగ్గుపల్లి శ్రీనివాస రావు, బోళ్ల మల్లికార్జున రావు, రాష్ట్ర నాయకులు సైదులు, నరేష్ చిన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించాలని కోరుతూ.. తహసీల్దార్ భగవాన్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్, కాంగ్రెస్ నాయకుల వినతిని పరిశీలిస్తానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, చిన్న శెట్టి యుగంధర్, సోయం ప్రసాద్, చిట్లు, వాసం శ్రీను, కొయ్యల ప్రసాద్, వాసం వేణు, శ్రీరాముల రమేష్, శ్రీను పాల్గొన్నారు.

సభ పోస్టర్లు ఆవిష్కరణ

గుండాల: మావోయిస్టులు, నక్సలైట్ల పేరుతో ఆదివాసి జాతి పతనానికి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24న వరంగల్‌లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్, తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు తెలిపారు. సభను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర ప్రథమ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం స్థానిక సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఆ సంఘం నాయకుల చేతుల మీదుగా ప్రచార పోస్టర్లను విడుదల చేసి, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 25, 27వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు గోగినపల్లి ప్రభాకర్, సంఘం నాయకులు గొంది లక్ష్మణరావు, కంగాల కన్నయ్య, వాసం బచ్చిరాజు, కంగాల వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

దివంగత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు పలు చోట్ల కేక్‌లు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఆరోగ్యకేంద్రాల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలకు, సమాచార సాంకేతికత విస్తరణకు పునాదులు వేసింది రాజీవ్ గాంధీ అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దుమ్ముగూడెం: కేక్ కట్ చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ తెల్లం సీతమ్మ



కరకగూడెం: వేడుకల్లో నాయకులు



చంద్రుగొండ: కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



చర్ల: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు